మరమ్మతు పూర్తయ్యేనా?

- నత్తనడకన లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రి పనులు
- అత్యవసర పనులపై పట్టింపు కరువు
- అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- పనుల జాప్యంతో రోగుల ఇక్కట్లు


రేకుల షెడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మరమ్మతు పనులు పది రోజులకు చివరి దశలో చేరుకున్నాయి. అత్యవసర పనులను అధికారులు పట్టించుకోవడం లేదు. రేకులు మరమ్మతు కోసం తొలగించగా ఇటీవల కురిసిన వర్షానికి ఆసుపత్రి మొత్తం ధ్వంసమైంది. సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీంతో మరమ్మతుకు మళ్లీ నిధులు మంజూరయ్యాయి. అధికారులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం జరుగుతోంది. నత్తనడకన పనులు సాగుతున్నాయి. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేటకు రోగులు వైద్యచికిత్స నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు. పనులు జాప్యంతో రోగులు, వైద్యసిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల కొద్ది ఓపీ ఉండడంతో సౌకర్యాలు సరిగా లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఓపీ వద్ద పలువురు రోగులు వేచి ఉంటున్నారు.

సౌకర్యాలు కరువు

పాత ఆసుపత్రి పక్కా భవనం ఇంకా పిల్లర్ల దశలో ఉండిపోయింది. దాని నిర్మాణానికి సుమారు రెండేళ్ల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. అప్పటివరకు పాత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో రోగులకు సౌకర్యాలు కరువయ్యాయి. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఇందులో కాలం వెళ్లదీయాలి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆసుపత్రిలో కేవలం 26 బెడ్‌లు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. సరిపడా బెడ్లు లేకపోవడంతో పలువురి రోగులను వరండాలో ఉంచుతున్నారు. ఇన్ పేషెంట్ సౌకర్యం లేదు.


పనులు చేపడుతున్న సిబ్బంది

వర్షం కురిసి ఐదు రోజులైనా ఇప్పటికి పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాలేదు. రోగులు ఉండే గదిలో పైన థర్మకోల్ షీట్లను నామమాత్రంగా వేస్తున్నారు. రేకులను అమర్చిన గోడ పైన రెండు వైపులా సిమెంట్ పని పూర్తి చేయలేదు.

కాలిపోయిన సామగ్రి

వర్షానికి విద్యుత్ సమస్య తలెత్తింది. ఫ్యాన్లు, ఫ్రిజ్, ఇన్వర్టర్ ఇతర సామగ్రి కాలిపోయాయి. ఫ్యాన్లు మాత్రమే బిగించారు. ఇన్వర్టర్‌కు మరమ్మతు చేయకపోవడంతో మందులు స్టోరేజీ చేయడం లేదు. రాత్రి సమయంలో రోగులు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేసి రోగులకు సేవలందించాలని పలువురు కోరుతున్నారు.


వరండాలోనే రోగులు

పనులు పూర్తి చేస్తాం



మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శనివారం లోగా రోగులను హాల్‌లోకి మారుస్తాం. బెడ్‌లు ఏర్పాటు చేస్తాం. ఇంకా ఫ్రిజ్, ఇన్వర్టర్ మరమ్మతు పనులు పూర్తిచేయిస్తాం. త్వరలోనే రోగులకు వైద్యసేవలందిస్తాం.

– శ్రీనివాస్, వైద్యాధికారి, ప్రభుత్వ ఆసుపత్రి, లక్సెట్టిపేట

ప్లాస్టిక్ నిషేధించి స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయాలి


దేవునిగూడలో స్టీల్ బ్యాంక్ పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

జన్నారం: గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ నిషేధించి, స్టీల్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసుకోవాలని మంచిర్యాల డీఆర్‌డీవో శేషాద్రి పేర్కొన్నారు. స్వచ్ఛ సుర్వక్షణ్‌లో భాగంగా మండలంలోని దేవునిగూడలో శుక్రవారం ఆయన పర్యటించి, ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో తడి, పొడి చెత్త నిర్వహణ, వృథా నీటిని అరికట్టే కమ్యూనిటీ సోఫ్ పిట్స్, శానిటేషన్‌పై అవగాహన కలిగించే వాల్ పెయింటింగ్, స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయడంపై సర్పంచ్ గుర్రం శిరిషరెడ్డిని అభినందించారు. గ్రామంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడేందుకు ఏర్పాటు చేయనున్న గోబర్ గ్యాస్ ఉత్పత్తి చేసేందుకు స్థల సేకరణ చేయాలని సర్పంచ్‌కు సూచించారు. లోత్‌ర్రే గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎంపీడీవో అరుణరాణి, ఏపీవో రవిందర్, ఐకేపీ ఏపీఎం బుచ్చన్న ఉన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా జరిగింది. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు ఏజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. 1, 5, 6, 14, 19 వార్డుల్లో వీధి దీపాల కోసం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు పట్టణ ప్రగతి నిధులు వ్యయం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించారు. అంతకుముందు పలువురు సభ్యులు సమస్యలపై మాట్లాడారు. మున్సిపాలిటీలో వీధి లైట్ల సమస్యలు లేకుండా చూడాలని, తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం రాకముందే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కమిషనర్ సమ్మయ్య, ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ పథకం ఏఈ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కృషితోనే వేజ్‌బోర్డులో జీతాలు పెంపు

కాసిపేట: ఐఎన్‌టీయూసీ కృషి, యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పోరాటంతోనే వేజ్‌బోర్డులో ఉద్యోగులకు జీతాలు పెరిగినట్లు ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎంజీబీ 19శాతంతోపాటు అలవెన్స్‌లో ప్రత్యేకంగా 25 శాతం పెరుగుదల సాధించినట్లు తెలిపారు. కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, కేంద్రకమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, నాయకులు తేజవత్ రాంబాబు, ఏరియా కార్యదర్శులు దొరిశెట్టి చెంద్రశేఖర్, బత్తుల వేణు, ఫిట్ కార్యదర్శి రవిందర్, అరకొడ శేఖర్, శివకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయండి


చిర్రకుంటలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

మందమర్రిరూరల్: జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏనుగు తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండలం లోని వెంకటాపూర్, పొన్నారం, ఆదిల్‌పేట్, మామిడిగట్టు, చిర్రకుంట, శంకర్‌పల్లిలో శుక్రవారం ఆయన పర్యటించి సమావేశాలు నిర్వహించారు. తిరుపతిరెడ్డి మా ట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మండల ఇన్‌చార్జి మద్ది శంకర్, జెడ్పీటీసీ వేల్పుల రవి, సర్పంచ్‌లు కొమురయ్య, రాయలింగు, సది, పున్నం, తిరుపతి, లక్ష్మి పాల్గొన్నారు.

జైపూర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని కోరుతూ ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. జూన్ 2 నుంచి ఉత్సవాలు ప్రారంభించి 3న రైతు దినోత్సవం, 4న సురక్షా దినోత్సం పోలీసుశాఖ, 5న తెలంగాణ విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న చెరువుల పండుగ, 9న తెలంగాణ సంక్షేమ సంబరాలు, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవం ఇలా 22వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు తెలిపారు. గ్రామాల కమిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: సుద్దాల, గంగారం, పొన్నారం, కాచన్‌పల్లి గ్రామాల్లో మండల కోఆర్డినేటర్ కమిటీ సభ్యుల సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు అందరు కలిసి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. ఎంపీపీ బాపు, జెడ్పీటీసీ తిరుపతి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కరుణసాగర్ రావు, రైతుబంధు మండల కోఆర్డినేటర్ రత్న సమ్మిరెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజల కోసమే 'కమ్యూనిటీ కాంటాక్ట్'


మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

భీమిని: ప్రజల రక్షణ, నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తాండూర్ సీఐ జగదీశ్ తెలిపారు. మండలంలోని మల్లీడి పంచాయతీలో 20 మంది పోలీసులతో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్‌తో కలిసి సీఐ మాట్లాడారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసు బాధ్యత అన్నారు. సైబర్ నేరాలు, అపరిచిత ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. ఎస్సైలు మహేందర్, రాజశేఖర్, నరేశ్, రాజశేఖర్, సర్పంచ్ సంతోష్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పాత బస్టాండ్ సమీపంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఎస్సైలు గంగారాం, అంజనేయులు, రామన్న ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి


రైతులతో మాట్లాడుతున్న రాధిక

భీమారం: రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా నాయకురాలు రామిళ్ల రాధిక డిమాండ్ చేశారు. మండలంలోని బూర్గుపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మండల నాయకులతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడారు. నర్సింగాపూర్‌లో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు పగలు రాత్రి కాపలా ఉంటున్నారని అన్నారు. దాదాపు 26 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. నాయకులు గుడిమల్ల వెంకటేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

అటవీ అధికారుల అత్యుత్సాహం

- గిరిజన మహిళ, బాలుడిపై దాడి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కోటపల్లి: అటవీ శాఖ భూముల హద్దు గుర్తింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వెంచపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ భర్త అన్నీ తానై వ్యవహరిస్తున్నా అటవీ శాఖ అధికారులు ×మామూలు×గానే తీసుకుంటున్నారు. మానవత్వం మరిచి గిరిజనులపై బీట్ ఆఫీసర్, ఆమె భర్త దాడులు చేస్తున్నా చోద్యం చూస్తున్నారు. మండలంలోని బోప్పారం గ్రామ సమీపంలో ఎన్నో ఏళ్లుగా గిరిజనులు, గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు సరిహద్దుగా అటవీ భూముల హద్దు గుర్తించడం కోసం అటవీ శాఖ అధికారులు ట్రెంచ్ పనులు నిర్వహిస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారి భూములు వదిలేయడం, ఇవ్వని వారి భూములు లాక్కోవడం చేస్తున్నారు. బీట్ ఆఫీసర్ గురువారం గ్రామంలో ట్రెంచ్ పనులు నిర్వహిస్తుండగా గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నిలిపివేశారు. శుక్రవారం ఫారెస్టు రేంజర్ పనుల పరిశీలనకు రాగా.. అక్కడే ఉన్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ భర్త ప్రశ్నించిన మహిళపై చేయి చేసుకునే క్రమంలో తోటి సిబ్బంది అడ్డుకున్నారు. బాలింత అని కూడా చూడకుండా తనను ఈడ్చుకెళ్లాడని బానోత్ లక్ష్మి ఆరోపించింది. ఇదంతా రేంజర్ ముందు జరుగుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తను రేంజ్‌కు తరలించి తన కొడుకుపై, తనపై దాడి చేశారని తెలిపింది. ఇదే విషయమై రేంజర్ రవిని సంప్రదించగా బీట్ ఆఫీసర్ భర్త అక్కడకి రాలేదని, తను ఎవరినీ కొట్టలేదని తెలిపారు. డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు అందింతే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాసిపేట: మండలంలోని తుంగగూడకు చెందిన మేకల కాపరి మేకల కొమురయ్య(45) చికిత్స పొందుతూ మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై అంజనేయులు కథనం ప్రకారం.. కొమురయ్య కూలీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. అప్పులు చేసి తీర్చేమార్గం లేక మనస్తాపం చెంది ఈనెల15న గ్రామసమీపంలోని అడవిలో విషం తాగాడు. అక్క మల్లక్కకు ఫోన్‌చేసి ఈ విషయాన్ని చెప్పాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. భార్య నాగమణి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


కన్నెపల్లిలో తనిఖీ చేస్తున్న ఎస్సై, ఏవో

భీమిని: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని కన్నెపల్లి ఎస్సై నరేశ్, ఏవో శ్రీకాంత్ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరైన ధరకు అందించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండలోని ఎరువులు, విత్తన దుకాణాలను ఎస్సై నరేశ్‌కుమార్, ఏవో రజిత తనిఖీ చేశారు. నిల్వలు, ఎరువులు, విత్తనాల నాణ్యతను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నకిలీ ఎరువులు, విత్తన విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కాసిపేట: మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఎస్సై గంగారాం, ఏవో వందన తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేశాక రసీదు తీసుకోవాలన్నారు.

సీపీఐ ప్రజాగర్జన విజయవంతం చేయండి

రామకృష్ణాపూర్: కొత్తగూడెంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ కోరారు. ఆర్‌కే1ఏ గనిలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మందమర్రిరూరల్: ఏఐయూసీ కార్యాలయంలో సీపీఐ ప్రజాగర్జన పోస్టర్‌ను పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్ ఆవిష్కరించారు. నాయకులు ఉన్నారు.

కౌన్సిల్ సమావేశంలో పది తీర్మానాలు


మాట్లాడుతున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పది అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన సమావేశం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో కొత్త పైపులైన్ల కొనుగోలు కోసం రూ.30 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య పనుల నిర్వహణ కోసం రూ.5 లక్షలు పట్టణ ప్రగతి నిధుల నుంచి వెచ్చించేందుకు, బీజోన్ రాజీవ్‌చౌక్‌లోని బస్‌షెల్టర్‌లో గల రెండు షటర్ల అద్దె పెంచేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్ రెడ్డి, మేనేజర్ నాగరాజు, ఆర్‌వో కృష్ణప్రసాద్, ఏఈ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న జీఎం మోహన్‌రెడ్డి

కాసిపేట: బొగ్గు ఉత్పత్తిలో అందరు భాగస్వాములు కావాలని మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి సూచించారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఉత్పత్తి ఉత్పాదకతపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సపోర్ట్‌మెన్, కోల్‌కట్టర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, ట్రామర్లు, మైనింగ్ సిబ్బంది, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌ల అభిప్రాయాలు తెలుసుకుని సలహాలు, సూచనలు చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. డీవైజీఎం(ఐఈడీ) రాజన్న, పవర్ ప్రైజెటేషన్ ద్వారా ఉత్పత్తి చేయడానికి ఉన్న మార్గాలను వివరించారు. ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ రాజేందర్, గని మెనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ కుమార్, ఫిట్ ఇంజినీర్ బాబు, ఇంజినీర్ మధుకర్, సంక్షేమాధికారి మీర్జా గౌస్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఫిట్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, భైరి శంకర్, అధికారులు, నాయకులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కోటపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకల రమేశ్ అన్నారు. మండలంలోని బబ్బరుచెలక, లక్ష్మీపూర్ గ్రామంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మహేశ్ ప్రసాద్, నాయకులు సంపత్, సుఖేందర్, జనగామ తిరుపతి ఉన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో చేపడుతున్న సమ్మె శుక్రవారం 40 రోజుకు చేరింది. పోశం, కృష్ణవేణి,వెంకటస్వామి ఉన్నారు.

వరిలో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన

చెనూర్‌రూరల్: మండలంలోని రచ్చపల్లి, ముత్తరావుపల్లి గ్రామాల్లో వరి ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలపై ఏఈవో సాగర్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆయిల్‌పాం పంట ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.

వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండ పంచాయతీలో శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వేసవి తీవ్రతతో ఇంటిపట్టునే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని, రోజుకు 10 గ్లాసులకు పైగా నీటిని తాగాలన్నారు. పండ్ల రసాలు, మజ్జిగ, అంబలి, కొబ్బరి నీళ్ల తీసుకోవాలన్నారు. దొనబడం, కర్ణమామిడి గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. హెచ్ఈవో రఘుపతి, సిబ్బంది పద్మ, జయమణి, సుమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

కోటపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఎంపీడీవో భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం ఈజీఎస్, కార్యదర్శులకు నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసీ నాగేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నెన్నెల: కుశ్నపల్లి, నెన్నెల, గొల్లపల్లి గ్రామాల్లోని పేదలకు లండన్‌కు చెందిన బీరం మల్లారెడ్డి, సుష్మారెడ్డి దంపతుల కూతురు ఆర్వీ, కుమారుడు అజిత్‌లు జన్మదిన వేడుకల సందర్భంగా నిత్యావసర సరుకులను మిత్రబృందం ఆకుల శ్రీనివాస్‌తో శుక్రవారం అందజేశారు. రవి, మధు, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

మద్దిమాడ సందర్శించిన డీఎల్‌పీవో

కాసిపేట: మండలంలోని మద్దిమాడ గ్రామాన్ని డీఎల్‌పీవో ఫణీందర్‌రావు శుక్రవారం సందర్శించారు. పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. మొబైల్ ఇన్‌స్పెక్షన్ యాప్‌లో భాగంగా వీధులను పరిశీలించారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచాలని, ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. శుక్రవారం గ్రీన్ ఫ్రైడేలో భాగంగా మొక్కలకు నీరు పోయాలని, గ్రామపంచాయతి రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో నాగరాజు, కార్యదర్శి సురేశ్ ఉన్నారు.

భీమారంలో గ్రీన్‌ఫ్రైడే

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రీన్‌ఫ్రైడేనిర్వహించారు. ఎలకేశ్వరంలో ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొని ప్రధాన రహదారి పక్కనే నాటిన మొక్కలకు నీటిని అందించారు. హరితహారం నర్సరీలను ఆయన సందర్శించారు. ఎంపీవో సతీశ్‌రెడ్డి, సర్పంచ్ కొడిపె సమ్మయ్య, కార్యదర్శి నవ్య ఉన్నారు.

క్లుప్తంగా

వార్డుల్లో పర్యటన


డ్రెయినేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఇసంపల్లి ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ కమిషనర్ రమేశ్‌ను ఆదేశించారు. వార్డు సభ్యులు తెనుగు లావణ్య దేవేందర్ తదితరులు ఉన్నారు

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి


15వ వార్డులో పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగాధర్

చెన్నూర్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కమిషనర్ గంగాధర్ అన్నారు. స్థానిక 15వ వార్డులో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 వార్డుల్లో పనులు చేపడుతున్నామన్నారు. కౌన్సిలర్ జాడి సురేఖ, సిబ్బంది రాజ్‌కుమార్ ఉన్నారు.

ఆటల పోటీలు

శ్రీరాంపూర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద శుక్రవారం మహిళలు, పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించింది. త్రో బాల్, బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పా ల్గొన్నారు. ఇందులో విజేతలైన వారికి ప్రగతి మైదానంలో జూన్ 2న జరిగే వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తారని అధి కారులు తెలిపారు. స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ సురేష్, సేవా సెక్రెటరీ జ్యోతి పాల్గొన్నారు.

దివ్యాంగుల ఇంటి కోసం స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

మంచిర్యాలక్రైం: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నస్పూర్ మండల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులకు ఉండేందుకు ఇళ్లు లేకపోవడంతో అద్దెకు ఉంటున్నారని తెలిపారు. నెలనెలా అద్దె చెల్లించేందుకు ఆర్థికంగా భారం అవుతుందన్నారు. దివ్యాంగుల నివాసం కోసం మండలంలోని 42, 64, 72, 119 సర్వే నంబర్లలో ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. నాయకులు అప్పారావ్, శ్రీధర్, బండ్ల శ్రీనివాస్, కమటం లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో పాల్గొనాలని ఆహ్వానం

బెల్లంపల్లి: పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో ఈనెల 29న 501 కలశాలతో జరిగే శోభాయాత్రలో పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు క్యాంప్ కార్యాలయంలో బెల్లంపల్లి పద్మశాలి సేవా సమాజం శ్రేణులు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు తడక మల్లయ్య (రవి), ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటస్వామి, కోశాధికారి భావనరుషి, సాంబారి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్ నీలి కృష్ణ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ కోరారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద చలో హైదరాబాద్ కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ప్రశాంత్, ఇన్‌చార్జి శ్రావణ్, నాయకులు శేఖర్, నాగరాజు, శ్రీధర్, శ్రీనివాస్, దుర్గయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.